క్లుప్తంగా

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సీఐ నైలు

కుంటాల: బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. సోమవారం కుంటాల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. దొంగతనాలు జరగకుండా రాత్రి వేళలో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది ఉన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల ఫేర్వెస్ టోల్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీ టోల్ ప్లాజాను కాంట్రాక్ట్ తీసుకుందని కార్మికులకు తక్కువ వేతనాలు చెల్లించేందుకు సిద్ధమైందన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ పీడీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీహరిరావు హామీ ఇచ్చారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే


ర్యాలీలో పాల్గొన్న ఎలక్ట్రీషియన్‌లు

ఖానాపూర్: ఖానాపూర్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచానికి వెలుగులు అందించిన రోజు జనవరి 27 అని అసోషియేషన్ నాయకులు అన్నారు. 1878లో థామస్ అల్వా ఎడిషన్ బల్బు కనుగొని చరిత్ర సృష్టించాడన్నారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో సంఘం జెండా ఆవిష్కరించారు. శ్రీహరి, ఆదినారాయణ, రాము, రాజు, ఖలీం, ఇమ్రాన్, మహేశ్, రమేశ్, గంగనర్సయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కుంటాల: మండలంలోని వెంకూర్ గ్రామంలో సోమవారం కళాకారులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు లక్ష్మణ్, రఘునాథ్, సుధాకర్, స్వామి, సుదర్శన్, నాగరాజు, జితేందర్, మాధవి, తస్లీమా సుల్తానా పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో క్రీడాపోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చయ్య

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాశీనాథ్ బచ్చువార్ స్మారక క్రీడాపోటీలు సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఖోఖో, క్రికెట్, క్విజ్ పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కోఆర్డినేటర్ ఓంప్రకాశ్ పాటిల్, అధ్యాపకులు రఘునాథ్, భీంరావు, పవన్‌కుమార్, పీజీ రెడ్డి, సీపీడీసీ చైర్మన్ నగేశ్, జనరల్ సెక్రెటరీ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పంట నమోదుపై శిక్షణ

సోన్: మండల కేంద్రంలో గల రైతు వేదికలో ప్రతీ మంగళవారం నిర్వహించే రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో నేడు 2024- 2025 యాసంగి పంట నమోదుపై (డిజిటల్ క్రాప్ సర్వే) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఏవో వినోద్ కుమార్ తెలిపారు. కార్యక్రమానికి సిబ్బంది హాజరు కావాలని కోరారు.

అధ్వానంగా రోడ్లు..!


అధ్వానంగా ఉన్న దొడర్నా రోడ్డు

- కంకర తేలిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

కుభీర్: మండలంలోని రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దొడర్నా, రంజని, మల్లేశ్వర్ రోడ్లు గుంతలమయంగా, కంకరతేలి ఉండడంతో రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. కాగా రెండేళ్ల క్రితం ఐటీడీఏ నిధులతో ప్రారంభించిన రంజని రోడ్డు, మల్లేశ్వర్ రోడ్డు పనులు అసంపూర్తిగానే నిలిచాయి.

కంకర తేలిన దొడర్నా రోడ్డు..

కుభీర్ నుంచి దొడర్నా మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు 2014లో పీఎంజీఎస్ నిధులతో రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో రోడ్డుపై వేసిన బీటీ కంకర తేలడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణానికి గత సంవత్సరం రూ.3 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ రోడ్డు మార్గంలో దొడర్నా, సాయినగర్ తండా, కిషన్ నాయక్ తండా గ్రామాలు ఉండగా రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కానీ ఇంకా పనులు ప్రారంభించక పోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు.


మల్లేశ్వర్ తండా రోడ్డు దుస్థితి

అసంపూర్తిగా రంజని రోడ్డు..

జామ్‌గాం నుంచి రంజని తండా వరకు 3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ. కోటి 20 లక్షలు మంజూరయ్యాయి. ఫార్మేషన్, గ్రావెల్ పనులు పూర్తిచేసి కంకర పరిచి బిల్లులు రావడం లేదని పనులు నిలిపివేశారు. దాదాపు రెండేళ్లు పూర్తయినా పనులు జరగడం లేదు. కంకరపై వాహనాలు జారిపోయి ప్రమాదాలు జరిగిన ఘటనలు సైతం ఉన్నాయి. ఈ రోడ్డు మార్గంలో జామ్‌గాం, రంజని, రంజని తండా గ్రామాల వారు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు.

నిలిచిన పనులు

కుభీర్ నుంచి మల్లేశ్వర్ మీదుగా దొడర్నా ఎక్స్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో ఐటీడీఏ నిధులు రూ.80 లక్షలు మంజూరయ్యాయి. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి గ్రావెల్ వేసి పనులు నిలిపివేశారు. ఈ రోడ్డు మార్గంలో సిర్పెల్లి, మల్లేశ్వర్ తండాల గ్రామస్తులు రాకపోకలు జరుపుతుంటారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

నిర్మాణం చేపట్టాలి


దొడర్నా రోడ్డు మంజూరై ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– అశోక్, దావుజీ నాయక్ తండా

తరుచూ ప్రమాదాలు..


రంజని తండా రోడ్డు పనులను మధ్యలోనే నిలిపివేశారు. కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే బిల్లుల రాక పనులు చేయడం లేదని చెబుతున్నారు. ఈ రోడ్డుపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– రాథోడ్ గులాబ్, రంజని తండా

త్వరలో ప్రారంభిస్తాం..

దొడర్నా రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ సైతం పూర్తయ్యింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– సునీల్, ఆర్‌అండ్‌బీ డీఈ, భైంసా

బాధిత కుటుంబాలకు పరామర్శ

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన కొరిపెల్లి భాస్కర్‌రావు, ఆయన భార్య అనసూయలు ఆత్మహత్య చేసుకోగా సోమవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, నాయకులు ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రానికి చెందిన మాజీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు వాజిద్ అహ్మద్ ఖాన్ సోదరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శ్రీహరిరావు సోమవారం పరామర్శించారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాదీ, సబాకలీం, అతీక్ అహ్మద్, నరేశ్ రెడ్డి, మజార్ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పరామర్శ..

కుంటాల: కుంటాల మాజీ జెడ్పీటీసీ గంగామణి బుచ్చన్న తల్లి నర్సమ్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. కాగా ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సోమవారం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.


నిర్మల్‌చైన్‌గేట్: వాజిద్ అహ్మద్‌ఖాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీహరిరావు

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్..

ఖానాపూర్: పట్టణంలోని పలు కుటుంబాలను సోమవారం మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ పరామర్శించారు. శివాజీనగర్ కాలనీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ దేవేందర్ కుటుంబంతో పాటు మైనార్టీ నాయకుడు వాహబొద్దీన్ కుటుంబాలను పరామర్శించారు. రెవెన్యూ రిటైర్డ్ ఏడీ ఉస్మాన్‌అలీ కొద్ది నెలల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖానాపూర్: పట్టణంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంకం రాజేందర్, పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను కలిసి సమస్యలపై విన్నవించారు. రోడ్డు వైండింగ్ పనులు ముందుకు సాగకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. పట్టణంలోని తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నందున వాటికి నూతన భవనాలు నిర్మించాలని కోరారు. వారసంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. నాయకులు తోకల బుచ్చన్న, పుప్పాల ఉపేందర్, అనిల్‌రావు, దాసరి శ్రీనివాస్, సందుపట్ల శ్రావణ్, జెట్టి సురేందర్, ఆసం సాయి, నాగరాజు, రాజేశ్వర్, సందీప్, అజయ్, జీవన్, శేఖర్, సుధాకర్, రాజు, సుమంత్, విష్ణు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సమతుల ఆహారం తీసుకోవాలి

నిర్మల్‌టౌన్: పిల్లలు, గర్భిణులు, బాలింతలు సమతులమైన ఆహారం తీసుకోవాలని ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ హుస్సేన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్మల్ నియోజకవర్గంలోని ఆశ వర్కర్లకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్మెంట్ అండ్ ఆశీర్వాద్ స్మార్ట్, ఢిల్లీ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10 నుంచి 17 సంవత్సరాల బాలురు, బాలికలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. అయోడిన్, పోషక ఆహార పదార్థాలు, ఆకుకూరలు, పండ్లు వంటి ఆహారా పదార్థాలపై అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమం రెండు రోజులు కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, సాయమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలెక్టరేట్‌లో తాగునీరు కరువు



జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి సమస్యలు చెప్పుకునేందుకు పెద్ద ఎత్తున జిల్లావాసులు వస్తుంటారు. సోమవారం సైతం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు రాగా గొంతు తడుపుకునేందుకు కనీసం తాగునీటి సౌకర్యం లేక అవస్థలు పడ్డారు. కలెక్టర్ కార్యాలయం పక్కన ఉన్న ప్రైవేట్ క్యాంటీన్‌కు వెళ్లి నీరు తాగారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

పాఠశాలలకు దాతల విరాళాలు


స్టడీమెటీరియల్ అందజేస్తున్న నారాయణ

కుంటాల: విద్యార్థులు కష్టపడి చదవాలని హెచ్ఎం కొత్తకాపు నారాయణ పేర్కొన్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా తాను విధులు నిర్వహిస్తున్న ఓలా పంచాయతీ పరిధిలోని రాజాపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురుకుల, ఆదర్శ పాఠశాల పోటీ పరీక్షలకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌ను సోమవారం అందజేశారు. తండా వాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం దాతలు విరాళాలు అందించారు. అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు జలపతిరెడ్డి, అమిత్‌లు రూ.14వేలతో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయగా, గ్రామానికి చెందిన బొప్పారం సాయారెడ్డి రూ. 5వేలతో ఇనుప టేబుళ్లు, పాన్కల్ పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కృష్ణమాచారి పాఠశాల అభివృద్ధి కోసం రూ. 7వేలు విరాళంగా అందించారు.

కడెంలో..

కడెం: మండలంలోని అంబారిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన శెట్‌పల్లి నారాయణ మెయిన్ గేట్, చిన్న గేటు, తాళ్లపల్లి రమేశ్ కార్డ్‌లెస్ మౌత్, రెంకల శ్రీనివాస్ రౌండ్ టెంట్, నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను ఉపాధ్యాయులు సన్మానించారు.

సర్వీస్ రోడ్డుపైకి వాహనాలు అనుమతించొద్దు


వినతిపత్రం అందజేస్తున్న సయ్యద్ హైదర్

నిర్మల్‌టౌన్: ఎన్‌హెచ్ 44హైవే పక్కన గల కడ్తాల్ సర్వీస్ రోడ్‌పైకి హైవేపై వెళ్లే వాహనాల రాకపోకలను అనుమతించొద్దని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ అన్నారు. సోమవారం ఢిల్లీలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జీఎం డీకే చతుర్వేదిని కలిసి సమస్య వివరించారు. ఈమేరకు సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కుంటాల: వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఏఎస్సై జీవన్ రావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కల్లూరు గ్రామంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై జీవన్ రావు

అపార్ నమోదుపై అవగాహన

తానూరు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న విద్యార్థులకు అపార్ నమోదు చేయాలని ఎంఈవో నరేందర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఆయా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు అపార్ నమోదుపై అవగాహన కల్పించారు. కాగా ముహలింగి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన.

మండలంలోని భోసి, ఎల్వి, తానూరులో నిర్వహించే 10వ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను సోమవారం ఎంఈవో నరేందర్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అవసరమయ్యే బెంచీలు, తాగు నీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు పరిశీలించారు.


అవగాహన కల్పిస్తున్న ఎంఈవో నరేందర్

పాఠశాల పరిశీలన

ముధోల్: మండల కేంద్రంలోని రవీంద్ర పాఠశాలను సోమవారం ఎంఈవో రమణారెడ్డి పరిశీలించారు. 10వ తరగతి బోర్డు పరీక్షల నేపథ్యంలో పాఠశాలలో నిర్వహించే పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ సాయినాథ్‌కు పలు సూచనలు చేశారు.

ఉత్తమ అధికారులకు సన్మానం


లక్ష్మణచాంద: సన్మానిస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు అవార్డులు అందుకున్న అధికారులను సోమవారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ, ఏవో వసంత్, ఉత్తమ మహిళ పీసీ శ్రీలతలను ఘనంగా సన్మానించారు. నిర్మల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నాయకులు ముత్యం తదితరులు పాల్గొన్నారు.


కడెం: కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

కడెంలో..

కడెం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డ్ అందుకున్న జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌కుమార్‌ను మండల రేషన్ డీలర్లు జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. రేషన్‌డీలర్ల అసోసియేషన్ మండలాధ్యక్షుడు కె.రాజేశ్వర్, శంకర్, ఎండీ శర్ఫోద్దీన్, ప్రసాద్, రాజశేఖర్, ప్రశాంత్, సాయిరాజ్ తదితరులు ఉన్నారు.

పసుపు బోర్డుతో రైతులకు లాభం

లోకేశ్వరం: నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం రైతులకు లాభదాయకంగా ఉంటుందని బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గడ్చాందలోని పోగుల సాయన్న అనే రైతుకు చెందిన పసుపు పంటలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సుమన్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా బీజేపీ కార్యదర్శి రమేశ్, నాయకులు మురళి, అనసూయ, సాయన్న, భూమన్న, దేవేందర్, కాసు భూమన్న, ప్రదీప్‌రావు ఉన్నారు.


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

బాధిత పిల్లలకు అధికారుల సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో శనివారం రాత్రి తన తల్లిని కొడుకు నరికి చంపిన ఘటనలో అనాథలైన ఇద్దరు పిల్లలను సోమవారం స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్ పరామర్శించారు. వారికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. 25 కేజీల బియ్యంతో పాటు రేషన్‌కార్డు లెటర్ అందజేశారు. ఎంపీడీవో శివకుమార్ సైతం పిల్లలను పరామర్శించి తన వంతుగా రూ. 5వేలు సాయంతో పాటు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఇందిరమ్మ ఇంటిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

కంది కొనుగోలు పరిమితి పెంపు హర్షనీయం

భైంసాటౌన్: కంది కొనుగోలు కేంద్రం పరిమితి పెంచడం హర్షనీయమని ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం అన్నారు. ఇటీవల కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం సందర్భంగా రైతులు ఎకరానికి 6 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆయన వ్యవసాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడారు. కొనుగోలు పరిమితి పెంచాలని విన్నవించారు. దీంతో స్పందించిన ప్రభుత్వం ఎకరానికి 6 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సమస్యలపై స్పందించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో నిర్మల్ రోడ్, ఓవైసీ నగర్, రాజీవ్‌నగర్, మోమినామ్‌గల్లి, ఏక్‌మినార్ ఏరియా, మదీనా కాలనీ, పల్సి ఫీడర్, స్పిన్నింగ్ మిల్ ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


పరిచయం చేసుకుంటున్న కిరణ్‌కుమార్

ఖానాపూర్: ఇటీవల మృతి చెందిన నిమ్మగడ్డ రవీందర్ స్మారకార్థం ఖానాపూర్ గాయత్రి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. సోమవారం పట్టణంలోని మినీస్టేడియంలో టోర్నీ నిర్వహించారు. గాయత్రి బ్రాహ్మణ సంఘ సభ్యులు సందీప్‌శర్మ, రాజశేఖర్‌శర్మ, అభిషేక్‌శర్మ, రాఘవశర్మలు టోర్నీ నిర్వాహకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో డా. కిరణ్‌కుమార్, న్యాయవాది వెంకట్ మహేంద్ర ఉన్నారు.

రోడ్ల నిర్మాణానికి రూ.7.8 కోట్లు మంజూరు

భైంసాటౌన్: నియోజకవర్గంలో పీఆర్ రోడ్ల నిర్మాణానికి రూ.7.8 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే రామారావు పటేల్ సోమవారం తెలిపారు. తానూరు –హుండా రోడ్డుకు రూ.5.90 కోట్లు, కుంటాల మండలంలో కుంటాల –దౌనెల్లి, మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.1.90 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. నిధులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు.

సమాజ సేవకుడికి పురస్కారం

ముధోల్: మండల కేంద్రం ముధోల్‌కు చెందిన సమాజ సేవకుడు గడ్డం సుభాష్‌కు గణతంత్ర వేడుకల్లో భాగంగా శాసకీయ సమాజ్ భూషణ్ పురస్కారం అందుకున్నారు. అతను చేస్తున్న సేవలకుగాను మహారాష్ట్రలోని ముఖ్కెడ్‌లో ఆదివారం మహారాష్ట్ర మాజీ సీఎం, ప్రస్తుత నాందెడ్ ఎంపీ అశోక్‌రావు చౌహాన్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు.